
# మహిళామణులకు సౌభాగ్యలక్ష్మి

## అర్హులకు ప్రతినెలా రూ. 3వేల జీవన భృతి





మ్యానిఫెస్టోలో ప్రకటించిన సీఎం కేసీఆర్

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే అమలు

తెల్లరేషన్ కార్డు ఉన్న అందరికీ వర్తింపు

జిల్లాలో సుమారు రూ. 3లక్షల మందికి ప్రయోజనం

ప్రతి నెలా రూ. 90కోట్ల వరకు సర్కారుపై భారం

**రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఇప్పటికే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నది. తాజాగా సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో మహిళలకు మరింత ప్రాధాన్యం కల్పించారు. సౌభాగ్యలక్ష్మి పథకంలో భాగంగా అర్హులైన పేద మహిళలకు ప్రతి నెలా రూ.3వేల జీవన భృతి కల్పిసామని హామీ ఇచ్చారు. దీనిని అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ప్రకటించారు. ఇది మహిళలకు ఆర్థికంగా ఎంతగానో ఉపయోగపడనుంది. కుటుంబ పోషణలో కీలకంగా వ్యవహరించే మహిళలకు అనేక విధాలుగా మేలు చేయనుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలకు ఈ భృతి ఇవ్వనున్నారు. జిల్లాలో 2.16లక్షల తెల్లరేషన్ కార్డులు ఉండగా.. సుమారు 3లక్షల మంది పేద మహిళలకు లబ్ధి చేకూరనుంది. ప్రతి నెలా ఒక్కొక్కరికి మూడు వేల చొప్పన అందిస్తే.. ప్రభుత్వంపై నెలకు రూ.90 కోట్ల దాకా అదనంగా భారం పడనుంది.**

– యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ)

### ఇప్పటికే ఎన్నో పథకాలు, కార్యక్రమాలు

స్వరాష్ట్రంలో మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రాధాన్యమిచ్చారు. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మహిళలను ప్రోత్సహించారు. మహిళా సంఘాలకు రుణాలు అందిస్తున్నారు. మహిళలు రాజకీయాల్లో రాణించేలా స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించారు. ఒంటరి మహిళలు, వితంతు, బీడీ కార్మికులకు ప్రతి నెలా ఆసరా పింఛన్లు ఇస్తున్నారు. కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, అమ్మ ఒడి, ఆరోగ్యలక్ష్మి, గృహలక్ష్మి, సఖీ కేంద్రాలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, బతుకమ్మ చీరెలు వంటి అనేక పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నారు. మహిళల రక్షణ కోసం షీటీమ్‌లు ఏర్పాటు చేశారు. ఇలా అనేక విధాలుగా లబ్ధి చేకూరుస్తుండగా.. మరో పథకం ప్రకటించడంపై మహిళామణుల్లో ఆనందం కనిపిస్తున్నది.

### నిరుపేదలకు దేవుడు సీఎం కేసీఆర్



ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదల పాలిట దేవుడు. ఎన్నో పథకాలను రూపొందించి ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకుంటుండు. ఇప్పుడు సౌభాగ్యలక్ష్మి పేరుతో సామాన్య మహిళలకు నెలకు రూ.3వేలు అందించాలనే నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్పది. తెలంగాణ వచ్చిన తర్వాత అన్ని గ్రామాల్లో అభివృద్ధి బాగా జరిగింది. ఎక్కడ చూసినా రోడ్లు, మురుగు కాల్వలు బాగుపడ్డాయి. వసతులు పెరిగాయి. ప్రజలంతా ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే ఉంటారు.

– కుడికాల శారదాంబ, రాంనగర్‌కాలనీ, భూదాన్ పోచంపల్లి

### మహిళలకు ఆర్థిక భరోసా



మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే ఆ కుటుంబం బాగుపడతది. అందరికీ మంచి జరుగతది. ముఖ్యమంత్రి కేసీఆర్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సౌభాగ్యలక్ష్మి పథకం మహిళలకు భరోసాగా నిలుస్తుంది. అర్హులైన మహిళలకు ప్రతి నెలా రూ.3వేల భృతి ఇవ్వడం గొప్ప పథకం. దీంతో పేద వర్గాలపై ఆర్థిక భారం తగ్గుతుంది. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే మహిళలకు మేలు జరుగుతున్నది. అధికారంలోకి వచ్చిన మొదటి నుంచే సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను మహిళల పేర్ల మీదనే ఇస్తున్నది. తాజాగా మానవీయ కోణంలో ఆలోచించి పేద కుటుంబాల మహిళలకు నెలకు రూ.3వేల చొప్పున జీవన భృతి అందిస్తామని ప్రకటించడం సంతోషకరం. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకునే మనసున్న గొప్ప లీడర్. గతంలో చెప్పినవే కాకుండా చెప్పనివి కూడా చేసిండు. ఇప్పుడు కూడా చెప్పినవన్నీ చేస్తడు. జీవన భృతికి శ్రీకారం చుట్టిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. బీఆర్ఎస్‌కు మహిళలమంతా అండగా ఉంటాం.

– కొడిదల విజయలక్ష్మి, కొండమల్లేపల్లి

### మహిళలను ఆదుకునేది సీఎం కేసీఆర్ ఒక్కరే



రాష్ట్రంలోని మహిళలకు ఏ కష్టం రానీయకుండా ఆదుకునేది సీఎం కేసీఆర్ ఒక్కరే. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆరోగ్యలక్ష్మి, బతుకమ్మ చీరెలు, కేసీఆర్ కిట్ వంటి అనేక పథకాలను అమలు చేయడంతోపాటు ఇప్పుడు పేద మహిళలకు నెలకు రూ.3వేల భృతి ఇస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడం ఆనందంగా ఉన్నది. సీఎం కేసీఆర్ మహిళల సంక్షేమానికి ఎంతో చేశాడు. ఇకముందు కూడా చేస్తాడనే నమ్మకం ఉంది. కేసీఆర్ సారు అందించే రూ.3వేల భృతితో మాకు ఎంతో మేలు జరుగుతుంది. మహిళలు ఆత్మగౌరవంగా బతికేందుకు ఉపయోగపడుతుంది. రాష్ట్రంలోని మహిళల రక్షణకు షీ టీమ్‌లను ప్రవేశపెట్టి వారికి అండగా నిలుస్తున్నారు. తెలంగాణలో మహిళలు ధైర్యంగా ఉన్నారంటే కేసీఆర్ వల్లనే. మేమంతా సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం. మహిళలమంతా బీఆర్ఎస్‌కు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– వంటెపాక జానకమ్మ, కుక్కడం, మాడ్గులపల్లి మండలం

### కేసీఆర్ సారుకు మహిళలంతా రుణపడి ఉంటారు



ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ మహిళా పక్షపాతిగా ఉన్నది. మహిళల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. మరోసారి అధికారంలోకి వస్తే అర్హులైన మహిళలందరికీ సౌభాగ్యలక్ష్మి పేరుతో నెలకు 3వేల రూపాయలు ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించడం హర్షణీయం. ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని రాష్ట్రంలోని మహిళలంతా నిండు మనస్సుతో స్వాగతిస్తున్నారు. మహిళా సంక్షేమం కోసం ఇంత చిత్తశుద్ధిగా పని చేస్తున్న కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రావాలని మహిళలంతా మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నారు.

– అమృత, గృహిణి, హాలియా

### సౌభాగ్యలక్ష్మితో మహిళలకు మరింత గుర్తింపు



సీఎం కేసీఆర్ సారుకు మహిళలంటే ఎంతో గౌరవం. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, గృహలక్ష్మి, కేసీఆర్ కిట్, ఆరోగ్య లక్ష్మి వంటి పేర్లతో మహిళలకు ఎన్నో పథకాలు తీసుకొచ్చారు. అంతేగాకుండా బతుకమ్మ పండుగలకు చీరెలు, ఒంటరి మహిళలను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ సారు. ఇప్పుడు మహిళలందరికీ ప్రతి నెలా మూడు వేలు ఇవ్వాలని సౌభాగ్యలక్ష్మి పథకాన్ని తీసుకొస్తున్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మహిళలను గుర్తించిండు అనే దానికి ఇంకా ఏం కావాలె. పెద్దన్నలా, మేనమామలా వెన్నంటి ఉంటున్న సీఎం కేసీఆర్‌కు తెలంగాణ మహిళలంతా రుణపడి ఉంటారు.

– సింగిరికొండ యామిని, నాగార్జున కాలనీ, నల్లగొండ

### సీఎం కేసీఆర్ అంటేనే నమ్మకం



సీఎం కేసీఆర్ అంటే రాష్ట్ర ప్రజలకు నమ్మకం. ఆయన మాట ఇస్తే తప్పే వ్యక్తి కాదు. పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రతి నెలా సరుకులు కొనాలంటే భారంగా ఉన్నది. పేద మహిళల కష్టాలను అర్థం చేసుకొని సౌభాగ్యలక్ష్మి పథకం ప్రారంభించి రూ.3వేలు ఇస్తామని బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడం ఆనందంగా ఉంది. గత ఎన్నికల్లో ఇవ్వని ఎన్నో పథకాలను అమలు చేసిండు. దీంతో రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడింది. ఒక వర్గం అని కాకుండా ప్రజలందరికీ అమోదయోగ్యమైన పాలన అందించి రెండు దఫాలుగా అధికారంలోకి వచ్చి రుజువు చేసుకున్నాడు. మూడోసారి కూడా ఆయనే సీఎం కావాలి. అట్లయితేనే పేదలు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు బాగుపడుతరు. సౌభాగ్యలక్ష్మి పథకం ప్రతి కుటుంబంలో వెలుగు నింపడం ఖాయం.

– నందిపాటి అనసూయమ్మ, కల్లూరు గ్రామం, నేరేడుచర్ల మండలం